

సందిగ్ధం!

పంట కాలువల నిర్వహణ పనులకు నిధుల పోటు

అంచనా వ్యయం భారీగా తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం

ఖరీఫ్ సీజన్ మరో 20 రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లా ప్రణాళికకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాతావరణం అనుకూలించి కాలువలకు సాగు నీటిని సకాలంలో విడుదల చేస్తే జూన్ రెండో వారం నుంచి రైతులు నారుమడులు పోస్తారు. ఖరీఫ్ సీజన్‌లో పంట కాలువలు, డ్రెయినేజీల నిర్వహణ (ఓఅండ్‌ఎం) పనులు చేసేందుకు కేబినెట్ గత గురువారం ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో ఓఅండ్‌ఎం పనులు చేసేందుకు పరిపాలనా పరమైన అనుమతులు వస్తాయని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, కిక్కిస, నాచు తదితరాల తొలగింపు పనులు మాత్రమే చేసేందుకు అవకాశం ఉందంటున్నారు. దీంతో ప్రధాన, బ్రాంచ్ కాలువల గట్లు బలహీనంగా ఉన్న చోట్ల వాటిని బలోపేతం చేయడం, కాలువల గేట్లకు మరమ్మతులు చేసేందుకు అనుమతులతోపాటు నిధుల విడుదలపై సందిగ్ధం నెలకొంది.

722 పనులు చేసేందుకు రూ.36.72 కోట్లతో అంచనాలు

- ఒక్కో నియోజకవర్గానికి రూ. 3 కోట్లకే అవకాశం
- కాలువల్లో మట్టి పనుల నిర్వహణపై అనుమానాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని పంట కాలువలు, డ్రెయినేజీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో 722 ఓఅండ్‌ఎం పనులు చేసేందుకు రూ.36.72 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం మాత్రం జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి రూ.3 కోట్ల కంటే అధికంగా నిధులు ఇవ్వలేమని చెప్పి, గతంలో పంపిన అంచనాల్లో కోత విధించినట్టు నీటి సంఘాల అధ్యక్షులు చెబుతున్నారు. కొద్దిపాటి నిధులతో ఏ పనులు చేయాలో తెలియక వారు తలలు పట్టుకుంటున్నారు. కాలువ గట్లు బలహీనంగా ఉన్న చోట్ల బలోపేతం చేసేందుకు, కాలువలు పూడుకుపోయినచోట్ల పూడికతీత పనులు చేసేందుకు నిధులు విడుదల చేయాలని సాగునీటి సంఘాల అధ్యక్షులు ఇటీవల మంత్రులు, శాసన సభ్యుల వద్దకు వెళ్లి కోరారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అసలు పనులు చేయకపోవడంతో తమ ప్రాంతంలో పంట కాలువలు, డ్రెయినేజీల్లో ఉన్న వాస్తవ పరిస్థితులను వివరించారు. తుఫానులు, భారీ వర్షాలు కురిసిన సమయంలో రైతులు నష్టపోయిన విధానాన్ని తెలియజేశారు. కాలువ గట్ల బలోపేతం, అవసరమైన చోట్ల పూడికతీత నిమిత్తం మట్టి పనులను ఉపాధి హామీ పథకంలో చేర్చి చేయాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ఈ పనులకు ఉపయోగించాలని ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చింది. అయితే ఈ ప్రతిపాదన ఎంత త్వరగా, ఎప్పటికి కార్యరూపం దాలుస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

పనుల అంచనాలు కుదింపు

గతంలో పంట కాలువలు, డ్రెయినేజీల్లో ఓఅండ్‌ఎం పనులకు టెండర్లు పిలిచేవారు. కోటిరూపాయల విలువైన పనులను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లంతా సిండికేట్‌గా మారి రూ.60 లక్షల నుంచి రూ.65 లక్షలకు టెండర్‌లు వేసేవారు. ఇంత తక్కువ మొత్తంలో పనులు దక్కించుకుని, పనులు సక్రమంగా చేయకుండానే అధికారులతో కుమ్మక్కై కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకునేవారు. ప్రస్తుతం పద్ధతి మిగతా 6లో..



కాలువలకు నీరు నిలిపివేత

ఏప్రిల్ 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రకాశం బ్యారేజీ నుంచి తాగునీటి అవసరాల కోసం జిల్లాలోని చెరువులను నింపేందుకు కాలువలకు నీటిని విడుదల చేశారు. మచిలీపట్నానికి తాగునీటిని అందించే తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపేందుకు గత శుక్రవారం వరకు బందరు కాలువకు కొద్దిమేర నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి విడుదలను పూర్తిస్థాయిలో నిలిపివేశారు. వారం రోజుల తర్వాత పంట కాలువల్లో పేరుకు పోయిన తూడు, గుర్రపు డెక్కలను నిర్మూలించేందుకు రసాయనాలు పిచికారీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం డ్రెయినేజీల్లో వేసవిలో వచ్చే కత్తెర పోట్లు కారణంగా ఉప్పునీరు వస్తోంది. ఈ ఉప్పునీటి ప్రభావంతో గుర్రపు డెక్క, నాచు, తూడు కొంతమేర చనిపోతుంది. చనిపోయిన వీటిని తీసి పక్కన వేయాలి. ఈ పనులు ప్రారంభించాలంటే ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన ఆమోదం లభించాల్సి ఉంది.



ఇక బైక్ భద్రం!

ఒక్కో వాహనానికి ఆర్‌ఎఫ్‌ఐడీ స్ట్రిప్

కూడళ్లలో రిసీవర్ బాక్సుల ఏర్పాటు

- కొత్త స్కీంపై పోలీసుల కసరత్తు
- సాఫ్ట్‌వేర్ కంపెనీతో సంప్రదింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మోటారు బైక్.. మధ్య తరగతి జీవికి సర్వస్వం. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు దాంతోనే పని. అది అందుబాటులో లేకపోతే ఇక అంతే.. ఒక్కమాటలో చెప్పాలంటే బైక్ మొరాయించినా, ఎవరైనా ఎత్తుకుపోయినా ఆ రోజు పనులన్నీ బందే. రూపాయి రూపాయి పోగేసుకుని కొనుగోలు చేసిన బైక్‌లను దొంగలు ఎత్తుకుపోతున్నారు. దీంతో రికవరీ కోసం బాధితులు పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నగరంలో ద్విచక్ర వాహనాలకు భద్రత కల్పించడానికి పోలీసులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ద్విచక్ర వాహనదారుల కోసం ఆర్‌ఎఫ్‌ఐడీ (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీతో పోలీసు శాఖ సంప్రదింపులు చేస్తోంది.

ఎలా పనిచేస్తుందంటే...

సాంకేతిక పరిజ్ఞానం వాహనాల్లోకి ప్రవేశించింది. ఖరీదైన కారులకు సెన్సార్, జీపీఎస్ సదుపాయాలు ఉంటున్నాయి. మార్కెట్‌లోకి వస్తున్న ఎలక్ట్రికల్ వాహనాలకు ఈ రెండూ ఉంటున్నాయి. ఈ సదుపాయాలు లేని వాహనాలకు యజమానులు ప్రత్యేకంగా జీపీఎస్ ట్రాకర్ అమర్చుకుంటున్నారు. ఇప్పటి వరకు మాయమైన బైక్‌ల్లో కొన్నింటిని పోలీసులు ఈ జీపీఎస్ ద్వారా పసిగట్టి పట్టుకున్నారు. ఈ జీపీఎస్ స్థానంలో దాని కంటే తక్కువ ఖర్చయ్యే సదుపాయాన్ని నగరంలోని ద్విచక్ర వాహనదారులకు ఇవ్వాలని పోలీసులు భావిస్తున్నారు. ఆ స్థానంలో మిగతా 6లో..

శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా పేరేపి ఈశ్వరరావు



పేరేపి ఈశ్వరరావు

విజయవాడ, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా నగరానికి చెందిన పేరేపి ఈశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈశ్వరరావు 25 ఏళ్లుగా టీడీపీలో పనిచేస్తున్నారు. ఈశ్వరరావు సేవలను గుర్తించిన పార్టీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ- పార్టీకి అంకితభావంతో పనిచేయడం, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆశీస్సులతో తనకు ఈ పదవి దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. 10 ఏళ్ల పాటు లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు సేవలందించానని చెప్పారు. ప్రస్తుతం 13వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు వివరించారు.

పల్లెల్ని వీడని బుడమేరు భయం!

పదేళ్లుగా ఆధునికీకరణకు నోచని వైనం

- మేట వేయడంతో పారుదలకు ఆటంకం
- వరదలతో భయాందోళనలో రైతులు
- భూ సేకరణతో సాగుకు దూరం 6లో

ముంచేశాడు..!

ధాన్యం దళారీ దెబ్బకు రైతులు విలవిల

కంకిపాడు, పెనమలూరు, గన్నవరం మండలాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా దళారులు తమ చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. రబీ సీజన్‌లో కంకిపాడు, పెనమలూరు, గన్నవరం మండలాల్లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ఓ దళారీ పెద్ద రైస్ మిల్లు యజమానితో కుమ్మక్కై, మద్దతు ధరలో భారీగా కోతపెట్టాడు. ప్రభుత్వంతో పనిలేకుండా ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేసి, నెలరోజుల్లో నగదు చెల్లింపులు చేస్తానని నమ్మించాడు. ధాన్యం మొత్తం జీపీఎస్‌లేని వాహనాల్లో ఒకే మిల్లుకు తరలించేశాడు. తీరా రైతులు డబ్బుల కోసం వెళితే రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం వివరాలు నమోదు చేయించుకోవాలని, అప్పుడే మీ ధాన్యం బిల్లులు వస్తాయని తాపీగా సలహా ఇచ్చాడు. బస్తాకు రూ.100 కమీషన్ ఇస్తే ఆర్‌ఎస్‌కేల్లో నమోదు చేయిస్తానంటూ బేరం పెట్టాడు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన దళారీ రైతులు విక్రయించిన ధాన్యం బస్తాకు రూ.300 నుంచి రూ.400 వరకు కాజేసేందుకు కుట్రపన్ని తమను ముంచేశాడని రైతులు మండిపడుతున్నారు.



- నెలరోజుల్లో నగదు చెల్లిస్తానంటూ చెక్కులిచ్చి మరీ నమ్మించిన దళారీ
- జీపీఎస్‌లేని వాహనాల్లో ధాన్యం మొత్తం ఒకే మిల్లుకు తరలింపు
- బిల్లుల కోసం వెళితే ఆర్‌ఎస్‌కేల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలని తాపీగా సలహా
- బస్తాకు రూ.100 ఇస్తేనే ఆర్‌ఎస్‌కేల్లో నమోదు అంటూ బేరం
- ధాన్యం దళారీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది రబీ సీజన్‌లో కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, గన్నవరం మండలాల్లో బోరునీటి ఆధారంగా 10 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఎకరానికి 45 నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చింది. ఆశించిన మేర దిగుబడులు రావడంతో రైతులు సంబర పడ్డారు. కానీ ధాన్యం నాణ్యతగా లేదనే సాకు చూపి ధరలో కోత పెట్టారు. 75 కిలోల బస్తాకు రూ.1,725 నుంచి 1,740 వరకు మద్దతు ధరగా ఇవ్వాలి. ఇటీవల కాలంలో అకాల వర్షాలు కురవడంతో ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. మళ్లీ వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి దెబ్బతింటుందనే భయంతో రైతులు హుటాహుటిని విక్రయించేశారు. ఇదే అదనుగా భావించిన కంకిపాడుకు చెందిన ఓ దళారీ రంగంలోకి దిగి ధాన్యం మిగతా 6లో..

ఎకరానికి రూ. 13,500లకుపైగా నష్టం

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం బస్తా ధాన్యం రూ.1,725లకు రైతుల నుంచి కొనుగోలు చేయాలి. నాణ్యత లేదని, తేమశాతం అధికంగా ఉందని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయదని తదితర కారణాలు చూపి దళారీ, మిల్లు యజమానులు ధాన్యం రూ.1300 నుంచి రూ.1400లకు ప్రైవేటుగా కొనుగోలు చేశారని రైతులు అంటున్నారు. ధాన్యం ప్రైవేటుగా కొనుగోలు చేసిన దళారీ, ఆ తర్వాత మాట మార్చి ఆర్‌ఎస్‌కేల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలనే షరతులు పెడుతున్నాడని వాపోతున్నారు. బస్తాకు రూ.300 నుంచి రూ.400 తమ నుంచి ఈ దళారీ కాజేశాడని, ఎకరానికి 45 బస్తాల దిగుబడి వస్తే, మద్దతు ధరలో కోత పెట్టడం వల్ల రూ.13 వేల నుంచి రూ.18వేల వరకు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.



మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లీబిడ్డల అనుబంధాన్ని తెలియజెప్పే వివిధ రకాల చిత్రాలను ఆదివారం విజయవాడలో చిన్నారులు అందంగా తీర్చిదిద్దారు. మాతృమూర్తులందరికీ హ్యాపీ మదర్స్ డే అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

రహదారి భద్రత పాటించండి

- ఎస్పీ గంగాధరరావు 6లో

వైభవంగా వేణుగోపాలుని కల్యాణోత్సవం

- పాల్గొన్న జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు 6లో

పదోన్నతి ఫైర్

వివాదాస్పద ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నిర్వాకం

- వైసీపీ హయాంలో అగ్నిమాపక శాఖలో అనర్హుడికి అందలం
- డీఎఫ్‌వో నుంచి ఏకంగా ఆర్‌ఎఫ్‌వోగా పదోన్నతి
- విజయవాడ కార్పొరేషన్ అగ్నిమాపక శాఖలో పోస్టింగ్
- మాజీమంత్రి మేరుగు నాగార్జున సిఫార్సు మేరకే..
- సీఎంవోకు చేరిన పంచాయితీ.. విచారణకు ఆదేశాలు

అర్హులను పక్కనపెట్టారు.. అనర్హుడిని అందలమెక్కించారు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖలో జరిగిన ఈ వివాదాస్పద వ్యవహారం ఇప్పుడు కూటమి ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. ఈ పదోన్నతి కల్పించింది వివాదాస్పద ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ కాగా, వెంటనే విచారణ చేయాలని ఫైర్ డీజీని సీఎంవో ఆదేశించింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అర్హతలు లేకపోయినా అగ్నిమాపక శాఖ పూర్వ విభాగాధిపతి పీవీ సునీల్ కుమార్ తన అనుయాయుడిని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో రీజనల్ ఫైర్ ఆఫీసర్ (ఆర్‌ఎఫ్‌వో) పీఠంపై కూర్చోబెట్టారు. వైసీపీకి చెందిన మాజీమంత్రి మేరుగు నాగార్జున సిఫార్సుతో ప్రభుత్వ ఆదేశాలు లేకుండానే, ఆర్థిక శాఖ ఆమోదం పొందకుండానే ఆ పదవిని కట్టబెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ నియామకానికి సంబంధించి ఆర్‌ఎఫ్‌వోకు కార్పొరేషన్ జీతభత్యాలను ఇస్తోంది. ఈ వివాదం తాజాగా ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ జరపాల్సిందిగా సీఎంవో.. అగ్నిమాపక శాఖ డీజీని ఆదేశించడంతో కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

సీనియారిటీని కాదని..

ఆర్‌ఎఫ్‌వోగా పదోన్నతి పొందడానికి ఆయన కంటే ముందు వరుసలో ఆరేడుగురు సీనియర్లు ఉన్నారు. వారిని కాదని.. సదరు అధికారినే అందలమెక్కించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా సదరు ఆర్‌ఎఫ్‌వోగా వచ్చిన అధికారి బదిలీపై మరోచోటకు వెళ్లేందుకు పైరవీలు చేసుకుంటున్నారని సమాచారం. పామర్రుకు చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి, మరో మాజీమంత్రి ద్వారా అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారుల దగ్గర చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



అక్రమ పోస్టింగ్ ఇలా..

అగ్నిమాపక శాఖలో జిల్లా ఫైర్ ఆఫీసర్లు (డీఎఫ్‌వో)లు మంజూరైన పోస్టుల కంటే అధికంగా ఉన్నారు. మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకు కలిపి 19 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 22 మంది పనిచేస్తున్నారు. ఇలాంటపుడు అదనంగా ఉన్న ముగ్గురికి రివర్షన్‌లో ఏడీఎఫ్‌సీలుగా పోస్టింగ్ ఇవ్వాలి. కానీ, ఇలా రివర్షన్ ఇవ్వాల్సిన వారిలో ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో ఆర్‌ఎఫ్‌వోగా పదోన్నతి ఇచ్చారు. ఆర్‌ఎఫ్‌వోగా నియమించాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తప్పనిసరి. కానీ, గుంటూరు జిల్లా డీఎఫ్‌వోగా ఉన్న అగ్నిమాపక శాఖ అధికారిని ఏడీఎఫ్‌వోగా రివర్షన్ చేయకుండానే, నేరుగా ఆర్‌ఎఫ్‌వోగా నియమించారు. సెకండ్ లెవల్ గజిటెడ్ ఆఫీసర్‌గా ఉన్న వ్యక్తిని ఫస్ట్ లెవల్ గజిటెడ్ ఆఫీసర్‌గా మార్చాల్సిన పోస్టుకు ఏకంగా మూడో లెవల్ గజిటెడ్ ఆఫీసర్ పోస్టును కల్పించారు. ఆర్థికశాఖ అనుమతులు లేకుండా ఆర్‌ఎఫ్‌వోగా పనిచేస్తున్న వ్యక్తికి 2023 మే మిగతా 6లో..



శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు, చిత్రంలో జిల్లా న్యాయాధికారులు

వైభవంగా వేణుగోపాలుని కల్యాణోత్సవం

» పాల్గొన్న జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు

పామర్రు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పెదమద్దాలిలో శ్రీ రుక్మిణీ భామ సమేత ఉద్దండ వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, వసంతలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషాచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివార్లకు జడ్జి దంపతులు కలాణోత్సవం నిర్వహించారు. జిల్లాలోని న్యాయాధికారులతోపాటు గ్రామంలో పెద్ద సంఖ్యలో భక్తజనులు స్వామివార్ల కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. భక్తులందరికి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తొలుత జస్టిస్ కృష్ణమోహన్ దంపతులకు జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ నూతక్కి సాంబశివరావు, మేనేజరు వేంకటేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయాధికారులు గ్రంధి సుబ్రమణ్యం, ఎన్.వాసుదేవ్, పి.గాయత్రి, పామర్రు తహసీల్దార్ రవికాంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ముందుకు సాగాలి

సనాతన ధర్మ పరిరక్షణ ధ్యేయంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని జస్టిస్ బి.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. హిందూ దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం మనఅందిరిపైనా ఉందన్నారు. పెదమద్దాలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని ఆయన చెప్పారు.



వీరవల్లి బైపాస్‌పై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ గంగాధరరావు

రహదారి భద్రత పాటించండి

» ఎస్పీ గంగాధరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో నిబంధనలు పాటించాల్సిందేనని కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు హెచ్చరించారు. వీరవల్లి బైపాస్‌పై ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని(బ్లాక్‌స్పాట్) ఆయన ఆదివారం పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవడంతో పాటు వేగనియంత్రణ తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. రహదారిపై మలుపులు, మెర్జింగ్ పాయింట్ల వద్ద వేగనియంత్రికలను ఏర్పాటు చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్, గన్నవరం సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.



4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

కృష్ణాజిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా 4వ తరగతి ఉద్యోగులసంఘం అధ్యక్షుడిగా ఎస్.ఎన్.ఎన్.ఎం.వి.ఆర్.వి. ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మచిలీపట్నంలో ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం సంఘ ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్, సహాయ అధ్యక్షుడిగా ఎం.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.కుమార్, ఎ.కోదండరామయ్య, కార్యదర్శులుగా ఎస్.రాము, సంయుక్త కార్యదర్శులుగా నాగలక్ష్మి, గోపీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌కె దబ్బార్, కోశాధికారిగా ఎం.నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఆర్.శ్రీనివాసరావు,ఎ.కొండయ్యలు వ్యవహరించారు.

బెరాకాలో చదివి.. అమెరికా వర్సిటీలో మాస్టర్ డిగ్రీ



» ఆకూరి ప్రభుదేవాకు అభినందన

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : అనాథ పిల్లల కోసం ఏర్పాటు చేసిన బెరాకా హాస్టల్‌లో చదివి ఉన్నత చదువులకు వెళ్లిన విద్యార్థి ఆకూరి ప్రభుదేవాను బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ అభినందించారు. మచిలీపట్నం బెరాకా హాస్టల్‌లో 4వ తరగతిలో చేరి టెన్త్, బీటెక్ ఉత్తీర్ణత పొంది హెచ్‌సీఎల్ ఇంజనీరింగ్ చేసి ఉన్నతవిద్య కోసం అమెరికా అల్లబామా యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తిచేసుకుని మచిలీపట్నం వచ్చిన ప్రభుదేవాను హాస్టల్ నిర్వాహకుడు కిరణ్‌పాల్ అభినందించారు.

'క్యాపిటల్'లో 3డి, 4కె వైద్యం

హాస్పిటల్ ఎండీ మన్నే హరీశ్

పెనమలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పోరంకి క్యాపిటల్ హాస్పిటల్‌లో జర్మన్ ఆధారిత 3డి, 4కె అల్ట్రా హెచ్‌డి మానిటర్ వైద్యం అందుబాటులోకి వచ్చినట్టు ఆసుపత్రి ఎండీ మన్నే హరీశ్ తెలిపారు. ఈ విధానంవల్ల సంక్లిష్ట శస్త్రచికిత్సలు అత్యంత ఖచ్చితత్వంతో, సునిశితమైన విభాగాలను గుర్తించి రోగికి తక్కువ ఇబ్బంది కలిగిస్తుందని జీఐ అండ్ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వి.సురేశ్ తెలిపారు. కేన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్సలో దీనిని ఉపయోగించడం వలన కణజాలాల్లో సూక్ష్మమైన విభేదాలను గుర్తించవచ్చన్నారు. ఈ అధునాతన పరికరంతో అతి సంక్లిష్టమైన ఎండోమెట్రియోసిస్, పెద్ద ఫైబ్రాయిడ్లు, ట్యూబల్ రీకెనలైజేషన్, లాపరోస్కోపిక్ గైనకాలజీ చికిత్సలు నైపుణ్యంగా చేయవచ్చని గైనాకాలజిస్ట్, సర్జన్ నేలవెల్లి అశ్విని తెలిపారు. యూరాలజీ సంబంధిత సర్జరీలలో ఈ పరికరం అధిక ఫలితాలు ఇస్తుందని డాక్టర్ త్రివేది తెలిపారు. 55 అల్ట్రా హెచ్‌డీ మానిటర్ అధునాతన పరికరాన్ని తొలిసారిగా ఏపీలో క్యాపిటల్ హాస్పిటల్ అందుబాటులోకి తీసువచ్చిందని, దీనితో జనరల్ సర్జరీలు, గైనకాలజీతో పాటు పలు సర్జరీల ఖచ్చితత్వాన్ని పెంచి రోగికి ఇబ్బంది లేకుండా త్వరగా కోలుకునేందుకు ఉపయోగ పడుతుందని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని హరీశ్ తెలిపారు. డాక్టర్ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మీ కోసం

మచిలీపట్నం టౌన్ : ఈనెల 12వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు జేసీ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారన్నారు.

పల్లెల్ని వీడని..

బుడమేరు భయం!



» పదేళ్లుగా ఆధునికీకరణకు నోచని వైనం
» మేత వేయడంతో పారుదలకు ఆటంకం
» వరదలతో భయాందోళనలో రైతులు
» భూ సేకరణతో సాగుకు దూరం

(కంకిపాడు-ఆంధ్రజ్యోతి)

ఉప్పలూరులో బుడమేరు పరిస్థితి దయనీయంగా మారింది. వంతెనకు ఇరువైపులా మేట వేసి మురుగు నీరు పారుదలకు అవకాశం లేకుండా పోయింది. బుడమేరు ఆధునికీకరణ పనులు చేపడతామంటూ స్థానిక రైతుల నుంచి భూసేకరణ చేపట్టి పదేళ్లయినా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మైలవరం కొండల్లో పుట్టి విజయవాడ మీదుగా కొల్లేరులో కలిసే బుడమేరు సుమారు 92 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. కంకిపాడు మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల పరిధిలోని సుమారు 1500 ఎకరాలకు సంబంధించిన మురుగు నీరు ఈ బుడమేరు కాలువలో కలుస్తుంది. అయితే ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో చిన్నపాటి వరద వచ్చినా బుడమేరు పొంగి ప్రవహిస్తుంది. బుడమేరు వంతెనకు ఇరువైపులా మేట వేయడంతో పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. 92 కిలో మీటర్ల పరిధిలో ఆక్రమణల కారణంగా వరదల సమయంలో వేల్పూరు, ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల పరిధిలోని సుమారు 1500 ఎకరాలు నీటమునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గతేడాది వరదల సమయంలో బుడమేరు



బుడమేరుపై మేట వేసిన ప్రాంతాన్ని చూపుతున్న రైతులు

మేట వేసిన బుడమేరు

గతేడాది వరదలకు తీవ్ర నష్టం..

గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన వరదల కారణంగా బుడమేరు నీట మునిగింది. వేల్పూరు గ్రామంలో ప్రధాన కాలువకు గండి పడి సుమారు 2 వేల ఎకరాలు నీట మునిగింది. అయితే గండిని పూడ్చేందుకు నేటికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. అదే విధంగా ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల పరిధిలోని బుడమేరు కాలువ పొంగి పొర్లడంతో సుమారు 10 రోజుల పాటు రాకపోకలు నిషేధించారు.

బుడమేరు ఆధునికీకరణకు భూసేకరణ..

పదేళ్ల క్రితం బుడమేరు ఆధునికీకరణ పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 33 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించింది. పదేళ్లుగా బుడమేరు ఆధునికీకరణ జరుగుతుందని ఎదురు చూస్తున్న రైతుల కల నెరవేరేలా కనిపించడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై రైతులు గంపెడాశలు పెట్టుకొని ఎదురుచూస్తున్నారు.

మేటతో పారుదల లేదు



- రామశేషయ్య, రైతు

బుడమేరు ఆధునికీకరణకు నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుడమేరు కాలువ బారు మేట వేసి నీటి పారుదలకు అవకాశం లేకుండా పోయింది. పనులు చేపడితే తప్ప సమస్య పరిష్కారం కాదు.

భూములు తిరిగి ఇచ్చేయండి



- కిరణ్‌కుమార్

బుడమేరు ఆధునికీకరణ అంటూ రైతుల నుంచి సేకరించిన భూమిని తిరిగి ఇచ్చేయాలి. పదేళ్లుగా సదరు భూములు సాగుకు నోచుకోవడం లేదు. త్వరితగతిన ఆధునికీకరణ చేపట్టాలి.

శిథిలావస్థకు బుడమేరు వంతెన




- మందపాటి కొండ

ఉప్పలూరు-కేసరపల్లి-గన్నవరం ప్రధాన రహదారిపై బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన బుడమేరు వంతెన శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో నిత్యం వంతెన నీట మునిగి పోతుంది. రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి.

భూ ఉద్యమ పోరాట యోధుడు చల్లపల్లి నారాయణరావు

నేడు నారాయణరావు 75వ వర్ధంతి



జ్ఞాపకం

చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటంలో దున్నేవానికి భూమి కోసం సాగిన పోరాటంలో ప్రాణబలిదానం చేసిన పోరాట యోధుడు కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావు. పోలీసుల కాల్పుల్లో నారాయణరావు మరణించి నేటికి 75 సంవత్సరాలు.

సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన 1928లో గుంటూరు ఏసీ కళాశాలలో ఇంటర్‌లో చేరి, 1930-32 కాలంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు చదువుకు స్వస్తిచెప్పారు. అన్న వెంకట రామదాసును స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని ఉత్సాహపరచటంతో సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అన్నదమ్ములు ఇరువురూ అరెస్టయ్యారు. రెండేళ్ల కఠినకారాగార శిక్ష నిమిత్తం తిరుచునాపల్లి జైలుకు తరలించారు.

జైలులో ఉండగా చల్లపల్లి నారాయణరావుకు పుచ్చలపల్లి సుందరయ్య, పోలిపెద్ది నరసింహమూర్తితో పరిచయం ఏర్పడి 1939లో దివి తాలూకాలోని జమిందారీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. 1944లో కృష్ణాజిల్లా వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1947లో గాజుల్లంకలో జరిగిన ఉద్యమంలో చల్లపల్లి నారాయణరావు పాల్గొన్నారు. నారాయణరావుకు ముగ్గురు కుమారులు, ఇరువురు కుమార్తెలు. నాగాయలంక మండలం తలగడదీవి కొత్తపాలెంలో రహస్యంగా ఉంటూ జ్వరంతో బాధపడుతున్న చల్లపల్లి నారాయణరావు, గోగినేని తాతయ్యలను పోలీసులు నిర్బంధించి 1950 మే 12 తెల్లవారు జామున పొలాల్లోకి తీసుకువెళ్లి కాల్చివేశారు. ఇద్దరి మృతదేహాలను ఇవ్వకుండా దహనం చేశారు. పోరాటయోధుల రక్తం చిందిన దళితవాడలో వారిపేరిట స్థూపం నిర్మించారు. కమ్యూనిస్టు పోరాటాలతో భూములను పేదప్రజలకు పంపిణీ చేశారు. చల్లపల్లిలో 227 ఎకరాల్లో 2500 కుటుంబాలకు నివేశనా స్థలాలు పంపిణీ చేయగా, నారాయణరావు నగర్ అని నామకరణం చేశారు.

- చల్లపల్లి, ఆంధ్రజ్యోతి

ముంచేశాడు..!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు మొత్తాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. కంకిపాడులోని ఒక పెద్దమిల్లు యజమానితో కూడబలుక్కుని ధాన్యం కొనుగోలు చేశాడు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయదని, తనకు ధాన్యం విక్రయిస్తే నెలరోజుల్లోపు నగదు ఇస్తానని, తనపై నమ్మకం కోసం రైతులకు ధాన్యం నగదు కింద చెక్కులు ఇస్తున్నానని చెప్పి, కొంతమంది రైతులకు చెక్కులు కూడా ఇచ్చాడు. బస్తాకు రూ.1,725 మద్దతు ధర ఉంటే రూ.1,300 నుంచి రూ.1,400 ధర నిర్ణయించి ధాన్యం కొనుగోలు చేశాడు. రైతులకు వ్యవసాయ ఖర్చుల కోసం మిల్లరు, దళారీ కలసి కొంత నగదును ముట్టచెప్పారు.

ఆర్ఎస్‌కేల్లో ఆన్‌లైన్ చేయించుకోండని ఇప్పుడు సలహా..

కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు మండలాల్లోని రైతుల నుంచి ధాన్యం ప్రైవేటుగా కొనుగోలు చేసిన దళారీ కంకిపాడులోని పెద్దమిల్లుకే మొత్తం ధాన్యం తరలించాడు. ధాన్యం బిల్లులు ఇవ్వమని రైతులు వెళితే రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సలహా ఇచ్చాడు. మీరు సాగు చేసిన పంట వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు కాకుంటే, వేరే గ్రామాల్లో రబీ సీజన్‌లో పంట సాగు చేసినట్లుగా, ఆ వివరాలు ఈ-క్రాప్ చేసినట్లుగా భూముల వివరాలు తన వద్ద ఉన్నాయని, అక్కడి రైతులు పంట సాగు చేసినట్లుగా చూపి ప్రభుత్వం నుంచి ధాన్యం బిల్లులు రాబడతానని, ఇందుకు బస్తా ధాన్యానికి రూ.50 నుంచి రూ.100 కమీషన్‌గా ఇవ్వాలని ఈ దళారీ షరతు పెట్టాడు. బస్తా ధాన్యం మద్దతు ధర రూ.1,725 ఉంటే రూ.1400 లోపే కొనుగోలు చేశావని, మళ్లీ ఈ-క్రాప్ పేరుతో ఈ కోతలేంటని రైతులు ప్రశ్నిస్తుంటే ఈ దళారీ తప్పించుకుతిరుగుతున్నాడు.

జీపీఎస్ నమోదులోనూ అక్రమమే..

రైతుల నుంచి ప్రైవేటుగా, తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన దళారీ ధాన్యం వివరాలను ఆర్ఎస్‌కేల్లో నమోదు చేయించేందుకు అక్కడి సిబ్బందిలో కొందరిని మచ్చిక చేసుకున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. గొడవర్రు, మద్దూరు, వణుకూరు, పెనమలూరు, చోడవరం, ఈడుపుగల్లు, ఉప్పలూరులోని ఆర్ఎస్‌కేల్లో ధాన్యం పూర్తిస్థాయి మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు నమోదు చేయాలని, జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాల్లోనే ధాన్యం కంకిపాడులోని మిల్లుకు తరలించినట్లుగా నమోదు చేయాలని ఆర్ఎస్‌కే సిబ్బందిపై ఈ దళారీ కొద్దిరోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. గొడవర్రు ఆర్ఎస్‌కే నుంచి జీపీఎస్‌లేని వాహనాల ద్వారా అధిక మొత్తంలో ధాన్యం తరలించినట్లు రైతులు చెబుతున్నారు. జీపీఎస్ సౌకర్యం లేని వాహనాల్లో ధాన్యం తరలించి, జీపీఎస్ ఉన్న వాహనాల నంబర్లను అడ్డగోలుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని ఈడుపుగల్లుకు చెందిన ఆర్ఎస్‌కే సిబ్బంది రెండు రోజుల క్రితం ఈ దళారీకి ఎదురు తిరిగినట్టు సమాచారం. రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు అన్ని మిల్లులకు పౌరసరఫరాలశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, కంకిపాడులోని ఒకమిల్లుకు అధిక మొత్తంలో, పెడనలోని మరో మిల్లుకు తక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వడం వెనుక ఏదో మర్మం దాగి ఉందని, పౌరసరఫరాలశాఖ కార్యాలయ అధికారుల పాత్ర ఇందులో ఉందని కొందరు మిల్లర్లు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

సందిగ్ధం!

(5వ పేజీ తరువాయి)

మారింది. ఓఅండ్‌ఎం పనులను విభజించి సాగునీటి సంఘాల పరిధిలోకి చేర్చి రూ.10 లక్షల అంచనాలతో చేసే పనులకు టెండర్‌లు పిలవకుండా నామినేషన్ పద్ధతిన పనులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనులు ఎక్కడ చేయాలనే కనీస అవగాహన ఉండి, అత్యవసరమైన ప్రాంతాల్లో ఓఅండ్‌ఎం పనులు చేయవచ్చని సాగునీటి సంఘాల అధ్యక్షులు భావించారు. అయితే ఇక్కడో మెలికపెట్టారు. రూ.10 లక్షల అంచనాలతో చేసే పనుల అంచనాలను రూ.6 లక్షలకు తగ్గించారు. ఉదాహరణకు అవనిగడ్డ, పెడన నియోజకవర్గాలలో 40 శాతం చొప్పున, మచిలీపట్నం నియోజకవర్గంలో 20 శాతం మేర పనుల అంచనాలలో ఈ ఏడాది కోతపెట్టారు. దీంతో సాగు నీటి సంఘాల అధ్యక్షులు పనులు చేసే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. జూలై నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ఓఅండ్‌ఎం పనులు చేస్తే, మార్చి తర్వాత నిదానంగా బిల్లులు చేస్తారని, ఒక్కోసారి బిల్లులు ఏడాది పాటు ఆలస్యం అయిన దాఖలాలు కూడా ఉన్నాయని సాగునీటి సంఘాల అధ్యక్షులు చెప్పుకుంటున్నారు. పంట కాలువల్లో చేసే పనులు కొంతమేర ఖర్చులతో నెట్టుకు రావచ్చని, డ్రెయినేజీల్లో ఓఅండ్‌ఎం పనులకు పెద్దమొత్తంలో ఖర్చుఅవుతుందని, పనుల అంచనాలు తగ్గిస్తే పనులు చేసినవారు నష్టపోవడం ఖాయమని సాగునీటి సంఘాల అధ్యక్షులు అంటున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండానే సాగునీటి సంఘాల అధ్యక్షుల పదవులు వచ్చాయని, సేవా భావంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని, కానీ నష్టం వచ్చేవిధంగా పనులు చేయాలంటే ఆలోచించాల్సిందేనని చర్చించుకుంటున్నారు.

ఇక బైక్ భద్రం!

(5వ పేజీ తరువాయి)

ఆర్ఎఫ్ఐడీని తీసుకురావాలని నిర్ణయించారు. ఈ ఆర్ఎఫ్ఐడీ టోల్‌గేట్ల వద్ద ఉండే ఫాస్ట్‌ట్యాగ్ మాదిరిగా పనిచేస్తుంది. కారు టోల్‌గేటు వద్దకు వెళ్లగానే ఎదురుగా ఉండే సీసీ కెమెరా ఆ వాహనంపై ఉన్న ఫాస్ట్‌ట్యాగ్ స్టిక్కర్(సెన్సార్)ను స్కాన్ చేస్తుంది. ఇది స్కాన్ కాగానే ఫాస్ట్‌ట్యాగ్ నుంచి నగదు టోల్‌ప్లాజాకు జమ అవుతుంది. దీని మాదిరిగానే ఆర్ఎఫ్ఐడీ పనిచేస్తుంది. సెన్సార్ కలిగిన ఒక స్ట్రిప్‌ను నగరంలో ఉన్న ద్విచక్ర వాహనాలకు అతికిస్తారు. నగరంలో ఉన్న అన్ని కూడళ్లలో ఆర్ఎఫ్ఐడీకి అనుసంధానంగా ఉండే రిసీవర్ బాక్స్‌లను అమర్చుతారు. ఒకవేళ ఎవరిదైనా బైక్‌ను దొంగిలించినప్పుడు అది ఏయే మార్గాల్లో ఎక్కడెక్కడ తిరిగిందన్న వివరాలు ఇట్టే పోలీసులకు తెలుస్తాయి. దీనితోపాటు బైక్ ఎక్కడుందన్న విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఆర్ఎఫ్ఐడీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. ఈ ఆర్ఎఫ్ఐడీ స్ట్రిప్‌ను పోలీసులు వాహనదారులకు అందజేస్తారు. ఒక్కో స్ట్రిప్‌కు నాలుగైదు రూపాయల ధర నిర్ణయించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కొంతమంది జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేసుకుంటున్నప్పటికీ దాని ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఒక్కో జీపీఎస్‌కు బయట రూ.1500 నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నారు. దీని కంటే చౌకగా ఆర్ఎఫ్ఐడీని అందజేయాలని పోలీసులు భావిస్తున్నారు.

పదోన్నతి ఫైర్

(5వ పేజీ తరువాయి)

నెల నుంచి జీతాలు ఇస్తున్నారు.

కావాలనే అందలం

విజయవాడ కార్పొరేషన్‌లో ఆర్ఎఫ్‌వో పోస్టు అంటే.. మూడో లెవల్ గజిటెడ్ ఆఫీసర్ హోదా కిందకు వస్తుంది. ఈ పోస్టుకు ప్రభుత్వం డీపీసీ జరిపి ఆదేశాలు ఇవ్వాలి. అలా కాకుండా అప్పటి డైరెక్టర్ జనరల్ ఫైర్ సర్వీసెస్ అధికారిగా ఉన్న పీవీ సునీల్ కుమార్ ఏకపక్షంగా ఫస్ట్ లెవల్ గజిటెడ్ అధికారిని మూడో లెవల్ గజిటెడ్ అధికారి స్థానంలో కూర్చోబెట్టారు. వివాదాస్పద సునీల్ కుమార్‌పై పలు అవినీతి ఆరోపణలు ఉండటంతో కూటమి ప్రభుత్వంలో సస్పెండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన హవా సాగించారు. మాజీమంత్రి మేరుగు నాగార్జున సిఫార్సు చేయటంతో నిబంధనలు అంగీకరించవని తెలిసినా ఆ అధికారిని అందల మెక్కించారు. ప్రస్తుతం విజయవాడ కార్పొరేషన్‌లో ఆర్ఎఫ్‌వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆ అధికారి ఈ ఏడాది నవంబరులో పదవీ విరమణ చేయనున్నారు. పదోన్నతిలో భాగంగా ఆయన తీసుకున్న రెండు ఇంక్రిమెంట్లను తగ్గించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ వివాదాస్పద పదోన్నతి వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నేటి నుంచి విధుల్లోకి సీపీ

విజయవాడ : పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సోమవారం నుంచి విధుల్లో చేరబోతున్నారు. ఆయన అమెరికా వెళ్లేందుకు గత నెల 25 నుంచి ఈనెల 11 వరకు సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సీపీగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వ్యవహరించారు. సెలవులు పూర్తవ్వడంతో రాజశేఖరబాబు విధుల్లో చేరతారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో సహా తరలివచ్చారు. కొందరు మొక్కుబడుల మేరకు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. కొండపైన క్యూలైన్లలో చేరి దుర్గమ్మ కరుణ కోరుతూ ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. కొంత మంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. పలువురు భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో శీనా నాయక్, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను ఈ.ఓ శీనా నాయక్, ఇతర అధికారులు సందర్శించి తగు సూచనలు చేసి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు. క్యూలైన్లలో అనుసరించాల్సిన విధివిధానాలపై సిబ్బందికి ఈవో శీనా నాయక్ పలు సూచనలు చేశారు. దర్శనం టికెట్ స్కానింగ్ పాయింట్, టికెట్ కౌంటర్స్, టికెట్ పంచింగ్ పాయింట్స్‌ను ఈవో పరిశీలించారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందనే విషయంలో భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత ఆరోగ్య కేంద్రం, మైక్ ప్రచార కేంద్రం, తదితరాలను ఈవో పరిశీలించారు. ఎస్‌పీఎఫ్ పోలీసు అవుట్ పోస్ట్ పరిశీలన చేసి, డ్యూటీ చార్ట్ వివరాలను తెలుసుకున్నారు. వేసవి సందర్భంగా చలివేంద్రాలు ద్వారా భక్తులకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేశారు.



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చిన్న తిరుపతిగా పేరుగాంచిన ద్వారకా తిరుమల చిన్న వేంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా దుర్గగుడి నుంచి ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈవో వీకే శీనానాయక్ దంపతులు, అర్చకులు, వేద పండితులు ద్వారకా తిరుమలకు చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ద్వారకా తిరుమల ఈవో ఎన్.వి.ఎస్.ఎన్.మూర్తి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాలు తీసుకువచ్చిన ఈవో శీనా నాయక్ బృందానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అర్చనల అనంతరం పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈవో వెంట ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకుడు శంకర శాండిల్య పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలలో వెంకటేశ్వరస్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఈవో శీనా నాయక్ దంపతులు, ఆలయ అర్చకులు

మానవ అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

పాయకాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా కేసులో కొవ్వూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులను నున్న రూరల్ పోలీసు లు శనివారం అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. పాయకాపురం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన కూతాడి పవన్‌ను చేపలు పట్టే పని ఉందని ఎక్కువ మొత్తంలో జీతం ఇస్తామని చెప్పిన నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు 7 నెలల క్రితం సంఘమేశ్వరం తీసుకెళ్లారు. అక్కడ కొవ్వూరుకు చెందిన బొడ్డు రాజు, కమలాకర్‌లు పవన్‌ను జనసంచారం లేని ప్రాంతాలకు తీసుకెళ్లి తిండి పెట్టకుండా చిత్రహింసలు పెట్టి నిర్బంధించారు. 6 నెలల పాటు జీతభత్యాలు లేకుండా ఒక్కపూట భోజనం పెట్టి వెట్టి చాకిరి చేయించుకున్నారు. నెలక్రితం అక్కడి నుంచి పారిపోయి వచ్చిన పవన్ కర్నాటక హుబ్లీ చేరుకుని అక్కడి పోలీసులు, నున్న రూరల్ పోలీసుల సహాయంతో ఇంటికి చేరుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు మిగిలిన ఇద్దరు బొడ్డు రాజు, కమలాకర్‌ను తాజాగా అరెస్ట్ చేశారు.

పుట్టపర్తి బాబా శత జయంతిని ప్రభుత్వ పండగలా జరపడం అప్రజాస్వామికం

» హేతువాద సంఘం

గాంధీనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని నిర్ణయించడం సిగ్గుచేటని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య మండిపడ్డారు. ఈ నిర్ణయం అప్రజాస్వామికమనీ, దీనికి సంబంధించిన జీవో 862ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న మ్యాజిక్‌లతో అమాయక ప్రజలను మోసం చేస్తూ వేల కోట్లకు పడగలెత్తిన సాయిబాబు అందరిలాగే ఒక మోసగాడని ఆరోపించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

రహదారి అభివృద్ధి పనుల పరిశీలన

కంకిపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఈడుపుగల్లులో రహదారి అభివృద్ధి పనులను ఆదివారం మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సుమారు రూ. 3 కోట్లతో ఈడుపుగల్లును అభివృద్ధి చేశామన్నారు. సర్పంచ్ పందిపాటి ఇందిర షేక్ షకార్, సుధాకర్, కామేశ్వరరావు, బాపూజి, రాము పాల్గొన్నారు.

కదలని మురుగు.. వదలని దోమలు!

- పూడుకుపోయిన పంట కాలువ
- వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న వీఎన్‌పురం కాలనీవాసులు

(గన్నవరం - ఆంధ్రజ్యోతి)

మండలంలోని కేసరపల్లి శివారు గన్నవరం అపార్ట్‌మెంట్‌లకు ఆనుకొని ఉన్న వెంకట నరసింహపురం కాలనీలో పంట కాలువ గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, నాచుతో నిండి పోయి మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా తయారయ్యింది. గత రెండేళ్లుగా ఈ మురుగు కాలువలో పూడిక పనులు చేపట్టకపోవటంతో పూడిక మేటేసింది. దీనికి తోడు గుర్రపుడెక్క కూడా పెరిగిపోయింది. దుబ్బు గడ్డి పెరిగిపోయింది. పంట కాలువ అన్నది కనపడకుండా పిచ్చి మొక్కలు, గడ్డి, గుర్రపుడెక్క కమ్ముకుపోయి ఉంది. గన్నవరం పట్టణం నుంచి వచ్చే మురుగునీరు అంతా చెరువు దగ్గర ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఇది గన్నవరం, పురుషోత్తపట్నం రోడ్డు వెంబడి సాగుతూ కేసరపల్లి సమీపంలోని వెంకట నరసింహపురం కాలనీ మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఎక్కడికక్కడ మురు గునీరు నిలువు ఉండి పోవడంతో దోమలకు ఆవాసంగా మారడమే కాకుండా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పగలు రాత్రి అని తేడా లేకుండా కాలనీ వాసులను దోమలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ దోమల కారణంగా వెంకట నరసింహపురం కాలనీ ప్రజలు తరచూ రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. వేలాది రూపాయలు ఇంటి పనులు కట్టించుకునే పంచాయతీ అధికారులు చిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకపోతు న్నారు. కాలనీ నుంచి లక్షలాది రూపాయల పన్నులు వసూలు చేసుకుం టున్న గ్రామపంచాయతీ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తీసుకోకపోతే కాలనీ వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.


ఆనవాళ్లు కోల్పోతున్న పంట కాలువ


మురుగునీటిపైన దోమలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ అగ్రనేత గౌతమ్ కుమార్

బహుజన సంకల్ప సభ విజయవంతం చేయండి

కంకిపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న బహుజన సంకల్ప సభను విజయవంతం చేయాలని బీఎస్పీ అగ్రనేత గౌతమ్ కుమార్ అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ పాటుపడుతుందన్నారు.అనంతరం పెనమలూరు నియోజకవర్గం నూతన కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో గుడె జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న అర్చకస్వాములు

కన్నుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ఉంగుటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంకపల్లి అగ్రహారంలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర పండితులు పరాశరం సత్యమూర్తి పాకయాజి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఆలయ దర్మకర్తలు గడ్డం వీరాస్వామి, అన్నంజ్వాలా నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారికి, దేవేరులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కమిటీ పెద్దలు పోఫూరి జగదీష్, వంగపండు రాంబాబు, నెక్కంటి శ్రీనివాసరావు, సతీసమేతంగా పీటలపై కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చదలవాడ కుమారస్వామి, శివనాగేశ్వరరావు స్వామి వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.



ఉయ్యూరు టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉయ్యూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా గేదెల వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా ఇబ్రహీం, సీహెచ్ దుర్గాప్రసాద్, సెక్రటరీగా దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీగా అగ్గిరాముడు, కోశాధికారిగా అబ్దుల్‌అల్తాఫ్, కార్యవర్గ సభ్యులుగా వెంకటలక్ష్మి, నళిని, నాగవేణి, భవానీ శంకర్, బాలాజీ, ఆంజనేయులు, సింహాచలంతో పాటు గౌరవ అధ్యక్షుడుగా ఆరేపల్లి వీరవెంకటేశ్వరరావు,సలహాదారులుగా అబ్దుల్ వాహెద్, అబ్దుల్ అన్సారీ, పి.రాజు, పిచ్చయ్య, వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.


చిన్నారులతో కథల పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి

కథల పుస్తకాలతో విజ్ఞానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కథల పుస్తకాలు చదవడం వల్ల వినోదం, విజ్ఞానంతో పాటు మెదడుకు ఉత్తేజం కలుగు తుందని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి తెలిపారు. వీరవల్లి గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు కథల పుస్తకాలు అందించి చదివించారు. విద్యార్థులను విభాగాలుగా విడదీసి ఆటల పోటీలు నిర్వహించారు.

ఉంగుటూరు : గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలని, చిన్నతనం నుంచి గ్రంథాలయాలకు వెళ్లడాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ విజ్ఞానవంతులుగా ఎదగాలని ఆత్కూరు, ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, యు.చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు, ఎల్.హరికృష్ణ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం నాలుగు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు.


ఉంగుటూరు గ్రంథాలయంలో అలంకరణ వస్తువులను చూపుతున్న విద్యార్థులు

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ పూజలు

హనుమాన్‌జంక్షన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో కూటమి నాయకులు ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ నాయకత్వంలో ప్రధాని మోదీకి మద్దతు తెలుపుతు పూజలు నిర్వహించారు ఉగ్రవాద దాడిని ఎదుర్కొనడానికి ప్రధాని మోదీకి మనోధైర్యాన్ని, ఆయురారోగ్యాలను అందించాలని కోరుతూ ఆలయంలో పూజలు జరిపారు. దేశంలో ఉగ్రవా దాన్ని అరికట్టడానికి ప్రధాని మోదీకి ప్రజలు మద్దతుగా నిలవాలని విక్రమ్ కిషోర్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కె.లక్ష్మీకృష్ణప్రసాద్, పెదపాడు మండల అధ్యక్షుడు పామర్తి చిన రంగారావు, స్థానిక టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, వడ్డి వాసవీ, పావులూరి రామారావు, పెదపాడు మండల బీజేపీ నాయకులు ఉండవల్లి వెంకట్రావు, గుమ్మడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్ హనుమాన్ ఆలయం వద్ద ప్రధాని మోదీకి మద్దతు తెలియజేస్తున్న కూటమి నాయకులు.. గన్నవరంలో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్

వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి

గన్నవరం : వీర మరణం పొందిన మురళీ నాయక్ అందరికి ఆదర్శమని బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం వీర జవాన్ మురళీ నాయక్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, తన ప్రాణాలు దేశం కోసం అర్పిం చటం వల్ల అందరి గుండెల్లో నిలిచి పోతారన్నారు. అదే విధంగా వీర మరణం పొందిన సైనికులకి మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నాదెండ్ల మోహన్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు కానూరి శేషు మాధవి, గన్నవరం కన్వీనర్ కురుమద్దాలి ఫణికుమార్, నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ, శ్రీనివాస్, అనిల్, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

కాటూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ఉయ్యూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని టీడీపీ నాయకులు అన్నారు. కాటూరులో ఈనెల 22వరకు నిర్వహించే కాటూరు ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఎంపీటీసీ సజ్జా అనూష, టీడీపీ నాయకులు వేమూరు శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. కాటూరు శరత్, కోడె హరీశ్, కొడాలి రవి, చీకుర్తి యుగబాబు తదితరులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, అనూష, శ్రీకాంత్


మాట్లాడుతున్న సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మోటూరి శంకరరావు, ఉపాధ్యక్షుడు పుసులూరి లక్ష్మీనారాయణ

దేశానికి సేవలందించేందుకు సిద్ధం

సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శంకరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులను అణచివేసేందుకు సాగిస్తున్న సమరంలో దేశరక్షణకు సేవలందించేందుకు మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నారని సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మోటూరి శంకరరావు అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం టీడీపీ మాజీ సైనికుల అనుబంధ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. మన రాష్ట్రంలోని 685 మండలాల్లో సుమారు లక్షమంది మాజీ సైనికులు ఉన్నారని తెలిపారు. ఇందులో 25వేల మందికిపైగా దేశరక్షణకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని, యుద్ధం వస్తే సేవలందించేందుకు తాము సదా సిద్ధమన్నారు. దేశప్రజలపై దాడులు చేసేవారితో పాటు సహకారం అందించే వారితో పోరా డేందుకు మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నామన్నారు. దీని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారత రక్షణశాఖతో చర్చించి తమను కూడా యుద్ధభూమికి పంపించే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ సంఘ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఐనంపూడి రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు పుసులూరి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాకా ఆదినారాయణ, ఎం. చినకొండలరావు పాల్గొన్నారు.

టీడీపీ ఈడుపుగల్లు అధ్యక్షుడిగా షేక్ షకార్

కంకిపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఈడుపుగల్లు గ్రామ అధ్యక్షుడిగా షేక్ షాకర్‌ను పరిశీలకులు దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణలు నియమించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ పార్టీలను ఆదివారం వారు నియమించారు. ఈడుపుగల్లు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా షేక్ షకార్ ముచ్చటగా మూడో సారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అను మోలు రామకృష్ణ, పార్టీ గొడవర్రు అధ్యక్షుడిగా ఉప్పలపాటి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా చెన్ను కొండలు, పార్టీ కాసరనేనిపాలెం అధ్యక్షుడిగా పెద్దు గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇరు కులపాటి బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి నాంచారయ్య, నీరుకొండ శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.


షేక్ షకార్‌ను టీడీపీ ఈడుపుగల్లు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించిన పరిశీలకులు దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణ తదితరులు

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి: కళ్లం

ఉయ్యూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. శ్రామిక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆకవరపు తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి.రాజేశ్, రైతు సంఘం మండల కార్యదర్శి సువర్ణరాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రామకృష్ణ, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రంగమ్మ, కృష్ణకుమారి పాల్గొన్నారు.


సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఘనంగా ఎల్లమ్మ ఉప్పలమ్మ కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజవీడు రోడ్డులో కన్నికంటి సాంబశివరావు ఇంటి ఆవరణలో వేంచేసి ఉన్న గ్రామ దేవతలు ఎల్లమ్మ ఉప్పలమ్మల కల్యాణోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్స వానికి ఆహ్వానం పలుకుతూ గ్రామంలోని పలు ఆలయాల్లోని దేవతలకు ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక నూజివీడు రోడ్డులోని ముత్యాలమ్మ, వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి, రామాలయం, సాయిబాబా, గంగానమ్మ, శివాలయం, తదితర ఆలయాల్లో సాంబశివరావు రత్నకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలను ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఓ పుట్టకు పూజలు చేసి సంప్రదాయంగా ఆ మట్టిని వినియోగించి కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు.



బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

పెదపారుపూడి, మే 11 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనంతోనే విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారిణి ఎస్.వి.ఎస్.లక్ష్మీ తెలిపారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులచే చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించారు. విద్యార్థులకు పుస్తక పఠనం - ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత తమకిష్టమైన పుస్తకాన్ని చదివించారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయంలో పాలపొంగళ్లు

గుడ్లవల్లేరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాలపొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు ఎటుంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కొండలరావు తెలిపారు.

ప్రత్యేక పూజలు

గుడివాడ : స్థానిక పెద్దకాలువ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో భారతీయ సైనికులు దేశ సరిహద్దు గ్రామాల ప్రజలు క్షేమంగా ఉండాలని కోరుతూ ఆదివారం బీజేపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ , గోపిక, కిరణ్, రీటా, పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులు, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో ఈ నెల 14వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో హెటిరో ల్యాబ్స్, ఎంఆర్‌ఎఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ముత్తూట్ ఫైనాన్స్, పతాంజలి ఫుడ్స్, సుధీర్ టింబర్ డిపో, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, మోడరన్ హెల్త్ సర్వీసెస్, పేటీఎమ్, వరుణ్ మోటార్స్, మోహన్ స్పిన్‌టెక్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్ వంటి ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. నిరుద్యోగులు, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్ కుమార్‌లు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 18 నుండి 35సంవత్సరాలలోపు యువత అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆసక్తికరమైన వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించబడతాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగానే తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు తమ బయోడేటా లేదా రెజ్యూమ్‌లతో పాటు ఆధార్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు, పాన్ కార్డు, సర్టిఫికెట్ జిరాక్సులను తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98488 19682, 96666 54641, 96767 08041కు సంప్రదించాలని ఆయన కోరారు.

వడ్డెరుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

● రాష్ట్ర కన్వీనర్ గంజి దయాకర్


సమావేశంలో మాట్లాడుతున్న
వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి

గుడివాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : జూన్ నెలలో నెల్లూరులో నిర్వహించనున్న వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి దయాకర్ కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ విస్తృతస్థాయి సమావేశాన్ని నాయకులు ఉప్పతల ఏడుకొండలు ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దయాకర్ మాట్లాడుతూ వడ్డెరలు ఐక్యంగా, ఒకే తాటిపైకి వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వడ్డెరుల సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్‌లను ప్రకటించాలన్నారు. రూ.1000కోట్లు నిధులు కేటాయించి, కార్పొరేషన్ విధివిధానాలను ప్రకటించాలని కోరారు. వడ్డెరలకు 90శాతం సబ్సిడీపై సంక్షేమ పథకాలను అందించి వృత్తిదారుల సంక్షేమానికి సహకరించాలన్నారు. వడ్డెర వృత్తిదారులపై భూస్వాములు, అగ్రకులాల వాళ్ల అత్యాచారాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వాటిని వెంటనే అరికట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా అట్రాసిటీ ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వడ్డెరలకు రక్షణ కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం వడ్డెరలు, వడ్డెర వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని గంజి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి బత్తుల నాగరాజు, జిల్లా కన్వీనర్ చంద్రగిరి శివనాగమల్లేశ్వరరావు, తమ్మిశెట్టి నాగ, చంద్రగిరి వెంకన్న, ఉప్పతల ఏడుకొండలు, చల్లా రాంబాబు, రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పామర్రు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పామర్రులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. 28 ఏళ్ల తర్వాత కలుసుకొన్న పూర్వ విద్యార్థులు రోజంతా ఆనందంగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, పూర్వ విద్యార్థి కాటూరి ఆనంద్ మాట్లాడుతూ పాఠశాలకు తమ వంతుగా రూ.20వేల విలువ చేసే సీసీ కెమెరాలు అందజేస్తామని, విద్యార్థులకు అవసరమయ్యే బల్లలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది పాఠశాల వజ్రోత్సవ సంవత్సరం సందర్భంగా మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సహచరులంతా సహపంక్తి భోజనాలు చేశారు.


1996-97 పదో తరగతి పూర్వ విద్యార్థులు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్సై చంటిబాబు

గుడివాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటూరు, గుంటా కోడూరు రైల్వే స్టేషన్ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం మోటూరు రైల్వే స్టేషన్, పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. మోటూరులో సెక్యూరిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డుపై తప్పని తిప్పలు

తోట్లవల్లూరు మే 11 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇటీవల కొత్తగా నిర్మించిన తారురోడ్డు భారీ ఇసుకలోడు లారీలకు రోడ్డు నలిగి కంకరరాల్లు పైకి తేలాయి. దీంతో ద్విచక్రవాహనదారులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురువుతున్నారు. మూడ్రోజుల క్రితం రాత్రి సమయంలో నలుగురు ద్విచక్రవాహనదారులు తమ వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాయని ప్రజలు చెపుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తోట్లవల్లూరులో ధ్వంసమైన రోడ్డు

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడివాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అస్కారముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం స్థానిక సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఆరుబయట నిద్రించడం, తలుపులు తెరచి పెట్టడం వంటివి చేయవద్దన్నారు. పిల్లలకు పరీక్షలు పూర్తి అయిన నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వకుండా తీర్థయాత్రలు, విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లడం వంటి కారణాలతోనే దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఊరు వెళ్ళేముందు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. బంగారు ఆభరణాలు, నగదు వంటి వస్తువులను బ్యాంకు లాకర్‌లలో భద్రపరచి వెళ్లాలని సూచించారు. ఎల్.హెచ్.ఎం.ఎస్‌ను వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ కోరారు.

మాతృమూర్తులు దైవంతో సమానం


తోట్లవల్లూరులో వస్త్రాలు బహుకరిస్తున్న శివరామ్

తోట్లవల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాతృమూర్తులను దైవంతో సమానంగా కొలవాల్సిన అవసరం ఉందని మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ అన్నారు. వల్లూరుపాలెంలో ఆదివారం రాత్రి హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా 25 మంది కి నూతన వస్త్రాలు బహుకరించారు. సేవా సంస్థ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మక్కిన శివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వెంకట అప్పారావు, వాసు, గిరిబాబు, ఉపసర్పంచ్ జె సద్గుణరావు పాల్గొన్నారు.

పామర్రు : మాతృదేవత పట్ల చిన్నతనం నుంచే ప్రేమభిమానాలను పెంచుకుంటూ భవిష్యత్తులో ముందుకు సాగాలని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణాతరగతుల్లో భాగంగా ఆదివారం మాతృమూర్తి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలనుద్దేశించి మాట్లాడుతూ కుటుంబంలో తల్లికి ఉన్న విశిష్టతను విద్యార్థులకు వివరించారు. జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో మాతృమూర్తి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.


పామర్రులో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

గొడుగుపేటలో ఆక్రమణల తొలగింపు, ఆక్రమిత స్థలం స్వాధీనం

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : గొడుగుపేటలో రామరాజు థియేటర్ ఎదురుగా ఉన్న ఆక్రమణలను ఆదివారం మునిసిపల్ అధికారులు తొలగించారు. థియేటర్ ఎదురుగా ఉన్న 555 చదరపు గజాల స్థలంలో 356 చదరపు గజాలు డంపింగ్ యార్డుగా వినియోగిస్తుండగా, 229 చదరపు గజాలు ఆక్రమణలకు గురయింది. దీంతో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆక్రమణలను ఆదివారం తొలగించి నగర పాలక సంస్థకు స్వాధీనం చేశారు. కమిషనర్‌తో పాటు మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ అన్నం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పాశ్చాపురం సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల అనంతరం జాతీయ జెండాలతో సంఘీభావం తెలుపుతున్న ప్రజలు

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోరుతూ పూజలు

బంటుమిల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పాశ్చాపురం సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారదేశం సురక్షితంగా ఉండాలని దేశ సమగ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న సైనికులు సురక్షితంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేసిన అనంతరం జాతీయ జెండాను చేతపట్టి ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావం తెలిపారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దివ్యజ్ఞాన భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు

ప్రపంచ శాంతికి దివ్యజ్ఞాన సమాజం కృషి

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతిని నెలకొల్పడమే దివ్యజ్ఞాన సమాజం ముఖ్య ఉద్దేశమని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. మచిలీపట్నం 46వ డివిజన్ ఈడేపల్లిలో దివ్యజ్ఞాన సమాజ కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. దివ్యజ్ఞాన సమాజం జాతీయ ఉపన్యాసకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 139 సంవత్సరాలుగా శాంతి స్థాపనకు దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తోందన్నారు. దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, ప్రధాన కార్యదర్శి కొత్తగుండు రమేష్, 45, 46వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జిలు పి.వి. ఫణి కుమార్, గండికోట అంజిబాబు, కారుమూరి రాజేంద్రప్రసాద్, గుడిసేవ మురళీధర్, కోశాధికారి కె. సత్య నారాయణ, న్యాయవాది కొత్తగుండు భాగ్యరాజ్, వేముల కోటేశ్వరరావు, మల్లంపల్లి రామాంజనేయులు బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్ పాల్గొన్నారు.



తల్లిదండ్రుల అంగీకారం తీసుకుంటున్న హెచ్‌ఎం కైతేపల్లి దాస్, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలకు ప్రైవేట్ విద్యార్థులు..

చల్లపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. చల్లపల్లి నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్‌ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, పాఠశాల ఉపాధ్యాయులు గత కొన్నిరోజులుగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాలు వివరిస్తూ, మోడల్ పాఠశాలలోని సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు తెలియచేస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల నుంచి సానుకూలత వ్యక్తమవుతుండగా, ఆదివారం ప్రవేటు పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను నారాయణరావు నగర్ మోడల్ పాఠశాలలో చేర్పించేందుకు అంగీకరించారు. ఉపాధ్యాయులు చంద్రకుమారి, విజయదుర్గ, రాధారాణి, దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు ముంతాజ్‌బేగం, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు : డీఎస్పీ రాజా

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారులమని ఫోన్లు చేస్తున్నారని, కేసు నమోదయిందంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వీరి మాటలు నమ్మవద్దని డీఎస్పీ రాజా అన్నారు. ఆదివారం డీఎస్పీ రాజా మీడియాతో మాట్లాడారు. మోసగాళ్ల కాల్స్ ఏవైనా వస్తే వెంటనే 9440796405 కు తెలియ చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన సీనియర్ సిటిజన్లు, ఉద్యోగులను టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



అవనిగడ్డ, మే 11 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దాదాపు రూ.లక్ష వ్యయంతో సమకూర్చిన శేష వాహనాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఆవిష్కరించారు. శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, కుమార్తె - అల్లుడు శీలం కృష్ణ ప్రభ - అశ్విన్ కుమార్ దంపతులు కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు), ధర్మకర్త పోతరాజు భాస్కరరావు నేతృత్వంలో అర్చకులు, దేవదాయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. పోత రాజు పవన్ కుమార్ - సుమిత్ర దంపతులచే కల్యాణం జరిగింది.



ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

నాగాయలంక, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులు భోగాది గాయత్రి, పూషడపు మనస్వి, యలవర్తి మహాలక్ష్మి, వల్లభనేని బాలాజీ, బావిరెడ్డి సుస్మిత, చెరుకూరి సంజయ్‌లను సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, మండల రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు భోగాది శివ విష్ణు ఆదివారం సత్కరించి అభినందించారు. చన్నగిరి లతా మోహన్, తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రామన్నమోడిలో మట్టి అక్రమ తవ్వకాలు





బంటుమిల్లిలోని పల్లెపాలెం రోడ్డు, పెందుర్రు వద్ద జాతీయ రహదారి పక్కన డంపింగ్ చేస్తున్న అక్రమార్కులు

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

• కళ్లు మూసుకున్న మైనింగ్ • కన్నెత్తి చూడని రెవెన్యూ

(ఆంధ్రజ్యోతి- బంటుమిల్లి) : మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోయింది. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రైవేట్ భూముల్లో మట్టి యథేచ్ఛగా తవ్వి అమ్ముకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

బంటుమిల్లి పల్లెపాలెం రోడ్‌లో పెట్రోల్ బంక్ పక్కన, పెందుర్రు సమీపంలో జాతీయ రహదారి పక్కన అనుమతులు లేకుండా మట్టి తవ్వి యథేచ్ఛగా మాఫియా సొమ్ము చేసుకుంటున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం, అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వదలివేయడం విమర్శలకు తావిస్తోంది.

గత ప్రభుత్వంలో మట్టి మాఫియా డాన్‌గా ఎదిగిన వ్యక్తి కూటమి ప్రభుత్వంలోనూ తన హవా కొనసాగిస్తున్నాడు. మట్టి తవ్వకానికి ప్రభుత్వానికి చలానా కట్టిన పాపాన పోలేదు. అధికారులకు, గ్రామ స్థాయి వార్డు మెంబర్ నుంచి ప్రతి స్థాయిలోని ప్రజాప్రతినిధులకు, ప్రత్యేక సలహాదారులకు సైతం భారీగా ముడుపులు చెల్లించినట్లు ఆధారాలు పెట్టుకుని మరీ మట్టిని కొల్లగొడుతున్నాడు. ఆడియో రికార్డులు, ఫోన్‌పే స్టేట్ మెంట్‌లు, బ్యాంకు లావాదేవీలు వంటి ఆధారాలు దగ్గర పెట్టుకుని తాను జరిపే మట్టి దందా ఆపే దమ్ము ఉం దా అంటూ సవాల్ విసురుతున్నాడు. తనను అడ్డుకుంటే అధికారులు, ప్రజాప్రతినిధుల అక్రమాలు అన్నీ మీడియా ముం దు పెడతానంటూ బెదిరిస్తున్నాడు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తనతో మాట్లాడిన మాటలు రికార్డింగ్ చేయ డం, ఎవరెవరికి ఏ రోజున ఎంతెంత మామూళ్లు ఇచ్చింది డైరీలో రాసి పెట్టుకుని మరీ సవాల్ చేస్తున్నాడు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కిమ్మనకుండా ఉండిపోతున్నారు. అతని ఆగడాలను అదుపుచేయలేక పోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మట్టిని కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదా యానికి గండి కొడుతూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నాడు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపుపై ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్రరావును వివరణ మట్టి తవ్వకం తమ పరిధిలోని కాదని జవాబిచ్చారు. మట్టి తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు.

పంటకాల్వ పూడ్చి అక్రమ తూములు - రైతుల ఆందోళన

పెడన రూరల్, మే11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తూములు వేసి పంట కాల్వను పూడ్చి వేసినా ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘం నాయకులు ఏ విధమైన చర్యలు చేపట్ట లేదని పలు గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమలాపురం లాకుల నుంచి పుల్లపాడు శివారు దేవరపల్లి వరకు వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే పంట కాల్వను నేలకొండపల్లి వద్ద పూడ్చి వేసి, అక్రమంగా తూ ములు ఏర్పాటు చేశారని తెలిపారు. కాల్వ పూడ్చివేయడం వల్ల నేలకొండపల్లి, చోడవరం, పెదపుల్లపాడు, దేవరపల్లి గ్రామా ల్లో వేలాది ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులకు గురవుతారన్నారు. దేవరపల్లి గ్రామంలో ఇప్పటికే సాగునీటి సమస్యతో పంటలు సక్రమంగా పండటం లేదని రైతులు తెలిపారు. వారం రోజుల క్రితం పంటకాల్వను పూడ్చినా అధికారులు చూసి వెళ్లారు తప్ప తూమును తొలగించలేదన్నారు. సమస్య ఉత్పన్నమయ్యే వరకు అధికారులు చోద్యం చూడకుండా తూములను తొలగించాలని దిగువ భూము ల రైతులు కోరుతున్నారు.



నేలకొండపల్లి వద్ద కాల్వలో వేసిన తూము

పోలీసుల ముమ్మర తనిఖీలు

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల దాడుల నేపథ్యం లో రైల్వేస్టేషన్, బస్టాండ్లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికులు బ్యాగులు సైతం తనిఖీ చేస్తున్నారు. **చల్లపల్లి** : ఉగ్రవాదుల కార్యకలాపాల దృష్ట్యా, భద్రతా చర్యల్లో చల్లపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు ఆదివారం తనిఖీ నిర్వహించారు. అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం తనిఖీ నిర్వహించారు. ప్రయాణీకుల బ్యాగ్‌లను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ విద్యశ్రీ మాట్లాడుతూ ప్రజలు అప్రత్తంగా ఉండాలని సూచించారు. **మోపిదేవి** : భారత్ - పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కూడలి ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన కూడలిలో ప్రయాణి కుల బ్యాగ్‌లు తనిఖీ చేసి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త వ్యక్తుల కదలికలు, అనుమానితులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాల్సిందిగా సీఐ తెలిపారు. మోపిదేవి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.





ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చల్లపల్లి రాజా హైస్కూల్ 1995 - 96 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు, నృత్య ప్రదర్శన ఇస్తున్న పూర్వ విద్యార్థి కుమార్తె

సందడిగా చల్లపల్లి రాజా హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చల్లపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి రాజా హైస్కూల్ 1995 - 96 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాల ప్రాంగణంలో సందడిగా జరిగింది. వివిధ ప్రాం తాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు తాము చదువుకున్న హైస్కూల్‌కు వచ్చి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. గురువులను కలుసుకుని ఆశీర్వాదాలు తీసుకున్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి. సాంబశివరావు, విశ్రాంత ఉపాధ్యాయులు డి.జవహర్, పి.ప్రభాకరరావు, జి.వి జయలక్ష్మి, నగరాజకుమారి, హెచ్‌ఎం ఎస్.సుదర్శన్, ఉపాధ్యాయులు టి.రేణుప్రసాద్, సాయిలీల, పీఈటీ శ్రీనివాస్, డి.వీరరాఘవయ్య, టివిఎస్.శాస్త్రిలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. పూర్వవిద్యార్థుల కుమార్తెలు మైత్రి పసియంతి, దీప్తి మల్లి, కేతన, దీప్తి, చరిత కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. పూర్వ విద్యార్థులు పేరం మధుసూదనరెడ్డి, ఉరిమి మణికాంత్, పి.రమేష్, నూకల ప్రసాద్, పి.సౌజన్య, తులసి, విమల, మల్లేశ్వరి, నాగచంద్రిక పర్యవేక్షించారు.



రోడ్డు ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత

మానవత్వం చూపిన ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను, మే 11 (ఆంధ్రజ్యోతి) : పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రోడ్డ ప్రమాద బాధితులకు స్వయంగా సేవలు అందించి మానవత్వం చాటారు. కృత్తివెన్ను మండల పరిధిలోని మాట్లం గ్రామానికి కాగిత వెళ్తుండగా పుట్లపూడి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలై, రోడ్డు పక్కన పడి ఉన్నారు. అది గమనించి కాగిత తక్షణమే కారును ఆపి, 108 వాహనానికి సమాచారం అందించారు. వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు.

మోపిదేవి ఆలయంలో రద్దీ

మోపిదేవి, మే 11 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం ప్రత్యేకత కావటంతో భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఒక్క రోజులోనే వివిధ సేవా రుసుముల ద్వారా రూ.8,90,493 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

అంకాలమ్మ తల్లి జాతర

కోడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోడూరులో రజకుల ఇలవేల్పు అంకాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలను, పాల పొంగళ్లను సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నారు. సుదూర ప్రాంతా ల్లో స్థిరపడిన రజకులంతా స్వస్థలానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా కరగ్రహారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర నాయకుడు పి.వి.ఫణికుమార్, విమలాగాయత్రి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ధర్మాన్ని నిలబెట్టి ఉగ్రవాదాన్ని అణచివేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నరసింహ స్వామి ధైర్యాన్ని, శక్తిని ఇవ్వాలని కోరామన్నారు.

డ్రైనేజీ పనుల పర్యవేక్షణ

మచిలీపట్నం టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : శిడింబి అగ్రహారంలో డ్రైనేజీ పూడిక తీత పనులను డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్ పర్యవేక్షించారు. మురాల నాగేంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

కోడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): హంసలదీవి బీచ్ వద్దకు అధిక సంఖ్యలో పర్యాటకులు రావటంతో సందడి వాతావరణం నెలకొంది. హంసలదీవి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. తీరం వెంబడి మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి, పోలీసు సిబ్బంది, మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేకనూరులో సూర్యనారాయణ స్వామి కల్యాణాన్ని అర్చకులు బాలకృష్ణ శర్మ బ్రహ్మత్వంలో అందె మురళీ - నాగరాజకుమారి దంపతులు జరిపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

టీడీపీ కోడూరు గ్రామ కమిటీ ఎంపిక

కోడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ గ్రామ కమిటీల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కోడూరు గ్రామ కమిటీ సభ్యుల ఎంపిక నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పూతబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పుట్టి కృష్ణ, కార్యదర్శిగా కాగిత శివ ప్రసాద్ ఎంపికయ్యారు. ఎంపికైన వారిని మండల పార్టీ అధ్యక్షుడు సత్కరించి అభినందనలు తెలిపారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పిల్లి మల్లిఖార్జునరావు, అప్పికట్ల రవీంద్ర, తోట సాంబయ్య, గజాల సుందరరావుతో పాటు స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఘంటసాల రాధాకృష్ణమూర్తికి సతీవియోగం

ఘంటసాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల గ్రామ కరణం ఘంటసాల రాధాకృష్ణమూర్తి సతీమణి విజయలక్ష్మి (84) ఆదివారం కన్నుమూశారు. ఈమె కుమారుడు ఘంటసాల కృష్ణ మోహన్ ప్రస్తుతం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు.

గ్రామ కమిటీల నియామకం పూర్తిచేయాలి

చల్లపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ గ్రామ కమిటీల సమావేశం ఈనెల 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు అన్నారు. ఎన్టీఆర్ పార్కులో మండల టీడీపీ సమావేశం జరిగింది. గ్రామాల వారీగా సభ్యత్వం కార్డులను అం దజేశారు. ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ కృష్ణకుమారి, నిడమానూరి దిలీప్‌కుమార్, ముమ్మనేని నాని, పైడి పాముల స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, జల్లూరు ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, మౌళి, కొడాలి మురళి, భువనేశ్వరరావు, షేక్ సిలార్, తాతినేని సాయి, బోలెం నాగమణి, అగ్గిరాముడు, మోర్ల శివ, మేకా వెంకటేశ్వరరావు, మురాల నాగేశ్వరరావు, మాతంగి వేణు, తాతా ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

వైభవంగా పోలాశమ్మ జాతర

అవనిగడ్డ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ గ్రామ దేవత పోలాశమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో అమ్మవారి ఘటం బిందెకు భక్తులు స్వాగతం పలికారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండలి వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్ మండలి శేషు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మవారు ఆలయానికి విచ్చేసిన అనంతరం సంబరం నిర్వహించారు.